

## పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు : జేసీ

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలలో 1300 పైగా ఉన్న ఓటర్ల పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నియోజక వర్గ ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ ఆధార్ అనుసంధాలపై రాజకీయ పార్టీల నాయకులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, లేపాక్షి తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మండల ఆర్ఐ అమరేంద్ర, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్చిలోనే మండుతున్న ఎండలు

## 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

## బయటకు రావటానికి జంకుతున్న జనం



**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

మార్చి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. వారం రోజుల క్రితం వరకు కొంత వరకు చల్లటి వాతావరణం ఉంటూ వచ్చింది. గడిచిన నాలుగైదు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. గురువారం నాడు అత్యధికంగా 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మండుతున్న ఎండలకు జనం బయటకు రావాలంటే భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్న సమయాల్లో జనం బయటకు రాలేకపోతున్నారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యమవుతున్నాయి. పాఠశాలలు కూడా ఒంటిపూట కావడంతో మధ్యాహ్నంలోపు ఇళ్లకు చేరుతున్నారు.

**కనిపించని చలివేంద్రాలు**

ఎన్నికలుంటే ఎక్కడ లేని సేవా కార్యక్రమాల్లో చేపట్టే నేతలు..అవి లేకపోవడంతో ఈఏడాది ఎక్కడా చలివేంద్రాలు కనిపించడం లేదు. లేకపోతే ప్రతి ప్రధాన కూడళ్లలోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేసే వారు. ముఖ్య కార్యాలయాల వద్ద కూడా వీటి దాఖలాలు కనిపించడం లేదు. దీంతో జనం దాహమైతే కూల్ డ్రింక్స్ దుకాణాల వైపు చూడాల్సి వస్తోంది. సేవ చేసే నేతలెవరూ ఇప్పుడు కనిపించడం లేదు.

**ఎలక్ట్రానిక్ పరికరాలకు పెరిగిన గిరాకీ**

వేసవి తాపం పెరుగుతుండటంతో ఎయిర్ కూలర్లు, ఏసిలు, ఫ్రిడ్జ్‌లకు గిరాకీ పెరిగింది. దీనికి తగ్గట్టు ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. అదే విధంగా మట్టి కుండల కొనుగోళ్లు పెరిగాయి. ఎలక్ట్రానిక్ పరికారల్లో కాకుండా నేచరల్‌గా నీటిని చలువ చేసుకుందామనుకున్న వాళ్లు వీటిని కొంటున్నారు.



రొద్దం మండలంలో ఎండలో నడిచివెళుతున్న పదోతరగతి విద్యార్థినులు

| తేదీ | ఉష్ణోగ్రత డిగ్రీల్లో |
|---|---|
| 14-03-2025 | 40.4 |
| 15-03-2025 | 39.8 |
| 16-03-2025 | 39.2 |
| 17-03-2025 | 40.2 |
| 18-03-2025 | 39.2 |
| 19-03-2025 | 40.7 |
| 20-03-2025 | 41.1 |

### శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు

# బకాయి వేతనాలు చెల్లించాలి

## రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్‌కు సిఐటియు వినతి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజలకు దాహార్తి తీరుస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరాలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విజయవాడలో కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్‌ను సిఐటియు నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో ఉమ్మడి జిల్లాలో 600 మంది కార్మికులు 14 సంవత్సరాలుగా పని చేస్తూ 850 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కార్మికులందరూ ముగ్గురు కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్నారని తెలిపారు. అయితే సదరు కాంట్రాక్టర్ నెల నెలా సరిగ్గా వేతనాలు చెల్లించడం లేదన్నారు. పిఎఫ్ జమ చేయడం లేదన్నారు. పైగా కార్మికుల వేతనాల్లో రూ.2,500 కోత విధిస్తున్నారని తెలిపారు. లేబర్ చట్టం ప్రకారం సదరు కాంట్రాక్టర్ 10వ తేదిలోపు కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్లు చెల్లించని పక్షంలో ఆర్‌డబ్ల్యుఎస్ సంస్థ చెల్లించాలని ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఏ నెలకు ఆ నెల వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాగునీటి కార్మికుల యూనియన్ నాయకులు ప్రభాకర్, వన్నూరుస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, తదితరులు

# ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడాలి

## మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్‌కుమార్

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజాసమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం మున్సిపల్ పరిధిలోని 20, 23, 28వ వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. పన్నుల వసూలు, సంక్షేమ పథకాలు, ప్లానింగ్ అప్రూవల్స్ తదితర అంశాలపైన చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌హెచ్‌ఒ శోభన్ రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి

## కలెక్టర్ టిఎస్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్. చేతన్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పరిశ్రమల, దిగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. జిల్లా ఆర్థిక అభివృద్ధికి నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామ వేతలకు ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. ఎక్కువమందికి ఉపాధి కలిగే విధంగా చర్యలు చేపట్టాలని, కొత్తగా పారిశ్రామిక రంగంలోకి వచ్చేవారికి బ్యాంకర్లు అవసరమైన రుణాలు అందించాలని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రోత్సాహం అందించాలన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం ఈజిపి పథకం కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక మండలాల వారిగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 56 దరఖాస్తులను వారంలోపు క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ ఖర్చు సబ్సిడీని సంవత్సరానికి రెండుసార్లు క్లైమ్ చేయాలన్నారు. మొదటి ఆరు నెలల అవగాహన కార్యక్రమాన్ని ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు తర్వాత అక్టోబర్ నుంచి మార్చి వరకు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు నాగరాజు, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, డిపిఒ సమత, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, ఎల్‌డిఎం రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతో మెలగాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

కారాగారాల నుండి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తలతో మెలగాలని జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. గురువారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగార రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపకారాగార అధికారి హనుమన్నతో జైలులో ఉన్న నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉండి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు వివరాలను తెలియజేస్తే ఉచిత న్యాయ సహాయం అందజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నిందితులతో వైద్యం, ఆహారం, ఉపకారాగార అధికారుల ప్రవర్తన తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు సిద్ధు, సదాశివరెడ్డి, సంతోషి కుమారి, మురళి, అంజనమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద తదితరులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి, శివప్రసాద్ యాదవ్

# మహిళను రక్షించిన 'పురం' పోలీసులు

**ప్రజాశక్తి-హిందూపురం**

తన భర్త చనిపోయిన సమయంలో వచ్చిన బీమా సొమ్ము కుటుంబ సభ్యులు తనకు ఇవ్వలేదని మనస్థాపం చెందిన ఓ మహిళ రైల్వే ట్రాక్ పై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా హిందూపురం అప్ గ్రేడ్ పోలీసులు సకాలంలో స్పందించి ఆమె ప్రాణాన్ని రక్షించారు. ఇందుకు సంబంధించి హిందూపురం రూరల్ అప్ గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు... లేపాక్షి కి చెందిన ఓ మహిళ తన భర్త ప్రమాదంలో మరణించినప్పుడు వచ్చిన పరిహారం డబ్బులను వారి కుటుంబ సభ్యులు మొత్తం తీసుకురు. అయితే ఆ డబ్బులు తన జీవనోపాధి ఇవ్వాలని ఆమె కోరగా వారు ఆ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్థాపం చెందిన ఆ మహిళ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. హిందూపురం రైల్వే స్టేషన్ దగ్గరకు వచ్చిన మహిళ తన తల్లికి మొబైల్ లో నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని తన గురించి ఎవరూ వెతక వద్దనినా బిడ్డ జాగ్రత్త అని మెసేజ్ చేసి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. వెంటనే మహిళ తల్లి లేపాక్షి పోలీసులను సంప్రదించగా స్టేషన్ లో విధులలో ఉన్న కానిస్టేబుల్ సాయి వెంటనే హిందూపూర్ రూరల్ అప్ గ్రేడ్ సిఐ ఆంజనేయులుకు సమాచారం అందించారు. వెంటనే 15 నిమిషాల్లో సెల్ లాస్ట్ సిగ్నల్ ద్వారా రైల్వే ట్రాక్ పైన మహిళ ఉన్నట్టు గుర్తించి, ఆ ప్రాంతానికి వెళ్లి ఆమెను రక్షించారు. మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు. ఓ మహిళా ప్రాణాలను కాపాడిన సిఐ ఆంజనేయులు, సిబ్బందిని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి. రత్న అభినందించారు.

# వైభవంగా ఖాద్రీశుడి రథోత్సవం





రథోత్సవానికి హాజరైన జనం

**ప్రజాశక్తి - కదిరి టౌన్, కదిరి అర్బన్**

శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో నిర్వహిస్తున్న ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మ రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం నడుమ శ్రీవారి రథోత్సవం కన్నుల పండుగలా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీ నరసింహాచార్యులు , పార్థసారథి చార్యులు రథం (తేరు )ముందు ఉదయం 7 : 45 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేతంగా వసంత వల్లభుడుని రథం పై కూర్చోబెట్టారు. 8 .15 నిమిషాలకు కూర్చోబెట్టి అనంతరం రథం ముందుకు సాగింది. శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీవారి బ్రహ్మ రథోత్సవం (తేరు) భక్తుల నామ స్మరణ మధ్య వైభవంగా సాగింది. అనంతరం స్వామివారి ఆరాధన అక్షతారోహణం , పూజలు చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని బ్రహ్మరథంపై కూర్చోబెట్టారు . మాడ వీధులలో భక్తుల దర్శన భాగ్యం కల్పించారు .అనంతరం తిరిగి యథాస్థానానికి 3.53 గంటలకు యథాస్థానంలోకి చేరుకొంది. బ్రహ్మ రథోత్సవం తిలకించడానికి ఉభయ రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి భక్తులు లక్షలాదిగా తరలివచ్చి ఎండ వేడిమి లెక్క చేయక మహిళలు, వృద్ధులు, చంటి పిల్లలతో కలిసి మిద్దెలు, మేడలపై రథం వచ్చేవరకు నిల్చొని రథోత్సవాన్ని తిలకించారు. ఖాద్రీశుడి అత్యంత ప్రతిపాత్ర అయిన దవనం , మిరియాలు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తేరు పై మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, వంశీకృష్ణలు రథం గమనాన్ని భక్తులకు వివరిస్తూ సవ్యంగా రథం ముందుకు సాగేలా సూచనలు ఇచ్చారు. రథోత్సవాన్ని తిలకించడానికి బుధవారం రాత్రి నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కదిరి వీధులు కిక్కిరిసి పోయాయి. మిద్దెలు మేడలు గోపురాలు చెట్లపై నుంచి ఎక్కిన భక్తులు స్వామివారి బ్రహ్మ రథోత్సవాన్ని తిలకించారు. తిరువీధుల్లో రథం సులభంగా ముందుకు కదిలేందుకు ,గంగిరెడ్డిపల్లి, గజరెడ్డిపల్లి, మూర్తి పల్లి , కూటగుళ్ల, బేరిపల్లి కి చెందిన స్వామివారి కాపులు వెనకాల తెడ్లువేస్తూ రథం ముందుకు సాగేందుకు సహకరించారు. రథం ఆగిన ప్రతిచోట అర్చకులు స్వామివారికి మహా మంగళహారతి ఇచ్చారు. మండు టెండను సైతం లెక్క చేయకుండా శ్రీవారి భక్తులు, యువకులు రథం లాగడానికి పోటీ పడ్డారు. రథం లాగే భక్తులకు పలువురు దాతలు,స్వచ్ఛంద సంస్థలు , అయ్యప్ప సేవా సమితి, కార్మిక సంఘులు, ఆధ్వర్యంలో పలుచోట్ల అన్నదానం మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. రథం ముందు యువకులు వసంతాలు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎస్ బి ఐ చీఫ్ మేనేజర్ హరి ప్రసాద్ తన సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రంలో డిప్యూటీ మేనేజర్ వెంకట్, ఫీల్డ్ అపీసర్ సాయి, సిద్ధిక్ బ్యాంకు సిబ్బంది ఇంజనీర్ కొమ్ము భాస్కర్ తదితరులు పాల్గొన్నారు



రథంలో కొలువైన ఖాద్రీశుడు

**రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే**

లక్ష్మీ నరసింహస్వామిని బ్రహ్మ రథోత్సవాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పార్థ సారథి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఏవి పార్థసారథి చార్యులు , ఏవి నరసింహ చార్యులు, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థ సారథి, ఇతర ప్రముఖులు పర్యవేక్షించారు.

**దవనం, కదిరి మల్లెలు ,కుంకుమ ప్రత్యేకత** : శ్రీవారి బ్రహ్మోత్సవాలలో శ్రీవారికి అత్యంత ప్రీతి పాత్రమైన వాటిలో కదిరి మల్లెలు. ఏటా మార్చి నెలలో బ్రహ్మోత్సవాలకు మల్లెలు వికసిస్తాయి. అలాగే స్వామికి ఇష్టమైన దవనం , మిరియాలు రథం పై చల్లి మొక్కులు చెల్లించుకుంటారు .కదిరి కుంకుమ ప్రత్యేకత ఏడాది పాటు ఇంట్లో శుభకార్యాలకు స్త్రీలకు నుదుటిన పెట్టుకోడానికి వీటిని మహిళలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

**పటిష్ట బందోబస్తు :** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు.. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథం సజావుగా సాగేందుకు జిల్లా ఎస్పీ రత్న ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందబస్తు ఏర్పాటు చేశారు. అందులో 3 డిఎస్పి లు,10 మంది సిఐ లు,20 మంది ఎస్ఐ లు 700 మంది ప్రత్యేక బలగాలు, పాల్గొన్నారు.

# దళితులపై దాడులు తగదు : కెవిపిఎస్

**ప్రజాశక్తి-హిందూపురం**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని, దళితులపై దాడులు చేయడం తగదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం కేవీపీఎస్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళితుల పైన దాడులు, అత్యాచారాలు, ఇళ్లను కూల్చి వేయడం లాంటివి ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో జరుగుతూనే ఉన్నాయన్నారు. తాజాగా గోరంట్ల మండలం బూదిలి గ్రామంలో జరిగిన సంఘటనే నిదర్శనం అన్నారు. దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను సైతం పక్కదారి పట్టించి ఆర్థికంగా, సామాజికంగా ఎదగనివ్వకుండా కూటమి ప్రభుత్వం అణగదొక్కాలని చూస్తోందని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ధులు సైతం సక్రమంగా వినియోగించడం లేదన్నారు. వెంటనే దళిత వాడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున దశల వారి ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు అన్నమయ్య, యోగానంద్, రామాంజనేయులు, చౌడప్ప, నరసింహులు, రాయుడు, మంజు, కిరణ్, జ్యోతి, సరస్వతి, శశికళ, గంగమ్మ, అనితమ్మ, చంద్రమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న కెవిపిఎస్ నాయకులు

# నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

నూతన విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం తాపత్రయ పడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హిందూపురం పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు జరుగుతుండగా కొన్ని విద్యాసంస్థలు ముందస్తుగానే అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# కార్మికులకు అండగా ఈశ్వర్ రబ్బర్ పరిశ్రమ

## వందల కుటుంబాలకు ఆసరా కల్పిస్తున్న ఈఆర్‌పి.. ప్రత్యక్షంగా 300, పరోక్షంగా 200 కుటుంబాలకు ఉపాధి

**ప్రజాశక్తి-పెనుకొండ**

పెనుకొండకు పరిశ్రమల గడం ఉందని, ఏ పరిశ్రమ నెలకొల్పినా మున్నాళ్ల ముచ్చటే అన్న ప్రచారం ఉండేది. అందుకు నిదర్శనంగా మారుతిగోల్ట్ స్టార్, రబ్బరు బిందెల ప్యాక్టరీ వంటి పరిశ్రమలు అట్టహాసంగా ప్రారంభించి అంతే వేగంగా మూతపడ్డాయి. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పెట్టుబడిదారులు వెనకడుగు వేసేవారు. ఈ నేపథ్యంలో తమిళనాడు నుంచి వచ్చిన వ్యాపావేత్త 1995 డిసెంబర్ నెలలో ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీని నెలకొల్పి వందలాదిమందికి ఉపాధి కల్పిస్తున్నారు.


ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ

**ప్రధాన ఉద్దేశ్యం...**

భారత దేశంలో రబ్బరు వినియోగం అధికమవుతోంది. వినియోగించిన రబ్బరుతో వాతావరణం కాలుష్యం అవుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రబ్బరు వస్తువులు రీసైక్లింగ్ చేసి తిరిగి వస్తువులను తయారు చేయడంతో వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. ఈ ఆలోచనతో ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ ప్రారంభమైంది. పనికిరాని టైర్లు, ట్యూబులను ఈ ఫ్యాక్టరీలో పొడిగా మార్చి తిరిగి రబ్బరుగా మారుస్తారు. అనంతరం టైర్లు, ట్యూబులు తయారు చేసే పరిశ్రమలకు సరఫరా చేస్తారు.

**దేశ, విదేశాలకు సరఫరా...**

ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీలో రీసైక్లింగ్ ద్వారా తయారైయ్యే రబ్బరు దేశ, విదేశాలకు సరఫరా చేస్తున్నారు. జపాన్, మలేషియా, శ్రీలంక, అమెరికా, ఇండోనేషియా, కొరియా తదితర దేశాలకు పంపుతున్నారు. ఈ ఫ్యాక్టరీలో తయారైన రబ్బరు దేశంలోని 50 శాతం సరఫరా చేస్తే, విదేశాలకు మిగతా 50 శాతం పంపుతున్నారు. ప్రముఖ టైర్లు, ట్యూబుల తయారీ సంస్థలు ఎంఆర్ఎఫ్, సియాట్, అపోలో వంటి కంపెనీలు ఈ రబ్బరు కొనుగోలు చేస్తున్నాయి.

**కార్మికులకు అండగా యజమాన్యం**

ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులకు యజమాన్యం అండగా ఉంటోంది. పెనుకొండకు 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ పరిశ్రమలో 300 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ ప్రారంభం నుంచి వందలాది కుటుంబాలు ఈ పరిశ్రమనే నమ్ముకున్నాయి. తల్లిదండ్రులు ఫ్యాక్టరీలో పనులు చేసి కుటుంబాలను పోషించుకుని, ఆడబిడ్డలకు పెళ్లిళ్లు ఘనంగా చేశారు. వయసు పెరగడంతో పని చేయలేని కార్మికులకు అండగా ఉండేందుకు వారి కుటుంబ సభ్యులకు ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశాలు కల్పించింది యజమాన్యనం. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఈఎస్ఐ, ఈపిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తోంది. ఉద్యోగ విరణ పొందిన కార్మికులకు తగినంత ఆర్థికసాయం అందిస్తోంది. 29 ఏళ్లగా ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల కుటుంబాలు వందకు పైగా ఉన్నాయి.

**నిబంధనల ప్రకారం రీసైక్లింగ్**

ఇక్కడ ప్రభుత్వ నిబందనల ప్రకారం రబ్బరు రీసైక్లింగ్ చేస్తున్నారు. వ్యర్థ టైర్లు, ట్యూబులను పొడిగా మార్చి తర్వాత రబ్బరుగా తయారు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి హానికర రసాయనాలు ఉపయోగించడం లేదు. ఫ్యాక్టరీ ముందుఉన్న వెంకటాపురం తండాలో వందలాది మంది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారిలో ఎవరికీ ఎలాంటి అనారోగ్య సమస్యలు తలేత్తలేదు. ఫ్యాక్టరీలో ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికుల ఆరోగ్యానికి ఎలాంటి డోకా లేదు.

**వందలాది కుటుంబాలకు ఉపాధి**

చిన్న పరిశ్రమగా ప్రారంభమైన ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ నేడు వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది. పరిశ్రమ ప్రారంభంలో 50మంది కార్మికులు మాత్రమే పని చేసేవారు. ప్రస్తుతం 300 మంది కార్మికులు ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. మరో 200 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. పెనుకొండప్రాంతంలో మూతపడకుండా విజయవంతంగా నడుస్తున్నా పరిశ్రమ ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ మాత్రమే. గతంలో పనులు లేక ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లే పరిస్థితులుండేవి. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించి వలసలు నివారించింది.

### కుటుంబమంతా ఫ్యాక్టరీలోనే పని చేస్తున్నాం..



ఫ్యాక్టరీ ప్రారంభం నుంచి నా భర్త పని చేశాడు. ప్రస్తుతం నేను, నాకుమారుడు ఈ ఫ్యాక్టరీలోనే పని చేసి జీవనం సాగిస్తున్నాం. ఫ్యాక్టరీ వల్ల మాజీవితాల్లో వెలుగులు నిండాయి. ఆడ బిడ్డలకు పెళ్లిళ్ల చేశాం. సొంత ఇంటిని నిర్మించుకున్నాం.

**ఎస్.దేవిబాయి, కార్మికురాలు వెంకటాపురంతండా**

### ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు..



27 ఏళ్లుగా ఫ్యాక్టరీలో పని చేస్తున్నాను. మాకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాలేదు. ఫ్యాక్టరీలో రసాయనాలు వినియోగించరు. యజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఉపాధి కోసం చాలామంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

**వెంకప్ప, కార్మికుడు, పెనుకొండ**

### కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది..



రబ్బరు రీసైక్లింగ్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దేశంలో రబ్బరు వ్యర్థపదార్థలు అధికమై వాతవరణం కాలుష్యం అవుతోంది. రీసైక్లింగ్ చేయడంతో ఉపాధి లభించడంతో పాటు కాలుష్య నివారణ సాధ్యం అవుతుంది. రబ్బరు రీసైక్లింగ్ ప్రక్రియలో ఎలాంటి హానికర రసాయనాలు ఉపయోగించడం లేదు. దాదాపు 30 ఏళ్లగా ఫ్యాక్టరీ నడపుతున్నాం. కార్మికులకు, ఫ్యాక్టరీ ముందున్న గ్రామ ప్రజలకు ఎలాంటి శ్వాసకోస వ్యాధులు రాలేదు. గతంలో 20 కుటుంబాలు నివాసం ఉంటే ప్రస్తుతం 300 కుటుంబాలు ఫ్యాక్టరీ ముందు ఉన్న తండాలో నివాసం ఉంటున్నాయి.

**రాజమణి, మేనేజర్, ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ**

## రైతులకు న్యాయం చేయాలి : ఎపి రైతు సంఘం

**ప్రజాశక్తి-పెనుకొండ**


గేట్ ముందు ట్రస్ట్ సభ్యుడితో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పట్టణంలోని శ్రీషిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఫాంహౌస్ లోపల ఉన్న రైతులు, ప్రభుత్వ భూములను పరిరక్షించి రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి డిమాండ్ చేశారు. ఆ ట్రస్ట్ ఫామ్ హౌస్ లోపల ఉన్న భూములను పరిశీలించడానికి గురువారం ఆయన రైతులతో కలిసి వెళ్లగా గేట్ వద్దని కాపలాదారులు అడ్డగించారు. లోపలకు వెళ్లకుండా గేట్లు మూసి తాళం వేశారు. ట్రస్ట్ సభ్యులు వచ్చి గేట్‌కు తాళం తీయడం కుదరదని తేల్చి చెప్పారు. హరి మాట్లాడుతూ రైతుల భూములను పరిశీలించేందుకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ఆసుపత్రి నిర్మాణానికి ట్రస్టు భూములు కొనుగోలు చేసిందన్నారు. ఆ భూమితో పాటు రైతుల భూములను కలుపుకొని చుట్టూ కంచె వేశారన్నారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సర్వే చేసేందుకు వెళితే అడ్డుకోవడం సబబు కాదన్నారు. ప్రభుత్వ భూమి, నీటి కుంటలను సైతం ఆక్రమించు కున్నారని రైతులు ఆరోపించారు. అనంతరం ఆర్డీవో ఆనంద్ కుమార్‌తో నాయకులు, రైతులు మాట్లాడారు. అధికారులు తక్షణమే సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని ఆర్డీవోకు విన్నవించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు రైతు సంఘం నాయకులు, రైతులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, రైతులు గిరి, వెంకటేష్, బంగారప్ప, అభిషేక్, హరి పాల్గొన్నారు.

## 'పది' మూల్యాంకనం నుంచి మినహాయించాలి

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**



డిఇఒ క్రిష్టప్పకు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

పదో తరగతి మూల్యాంకనం విధుల నుంచి నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, ఫిజికల్లీ, విజువల్లీ ఛాలెంజ్డ్ ఉపాధ్యాయులు, 58 ఏళ్లు నిండిన, మానసిక రుగ్మత పిల్లలు ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గురువారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిఇఒ క్రిష్టప్పకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే 25 ఏళ్ల సర్వీస్ నిండి, 50 ఏళ్లు పైబడిన ఎస్‌జిటిలను స్పెషల్ అసిస్టెంట్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయుల కోరిక మేరకే డ్యూటీలు వేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల పలు సమస్యలను డిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. వినతి ఇచ్చిన వారిలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రామ్‌ప్రసాద్, మల్లేష్, అమర్నాథ్‌రెడ్డి, రామాంజనేయులు, సకల చంద్రశేఖర్, సురేష్, శివారెడ్డి ఉన్నారు.

## టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలి

### 25న కలెక్టరేట్ వద్ద ధర్నా : సిపిఎం

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**


టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహ టిడ్కో భవన సముదాయలను పూర్తి చేసి విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ, తదితర కనీస సౌకర్యాలు కల్పించి తక్షణమే పూర్తి చేసి లబ్ధిదా రులకు అప్పజెప్పాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలో ఎల్-4 కాలనీ సమీపంలో గత టిడిపి ప్రభుత్వం నిర్మించతల పెట్టిన అపార్ట్‌మెంట్లను గురువారం సిపిఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఆలకుంట మారుతి, టి.అయూబ్‌ఖాన్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ గృహాల నిర్మాణం చేపట్టిందని, ఆ తర్వాత 2019-24 సమ యంలో వైసిపి ప్రభుత్వం వీటిని విస్మరించింద న్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధు లు, అధికారులు కూడా వీటి వైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమన్నారు. నాసిరకం సామగ్రి వినియోగించడంతో ఇప్పటికే గోడలు నెర్రెలు చీలాయని విమర్శించారు. అనంతరం ఎల్-4, ఎల్-3 కాలనీల్లో పర్యటించగా స్థానికులు తాగునీరు, వీధి లైట్లు, డ్రెయినేజీ కాలువలు, కుక్కల బెడద, తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయా సమస్యలపై ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, పేదలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, సిపిఎం నాయకులు వెంకటస్వామి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి నిధులు ఇవ్వాలని వినతి

**ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి**

చెన్నేకొత్తపల్లిలోని పురాతన అహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ గురువారం గ్రామస్తులు తితిదే బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని ఇటీవల గ్రామపెద్దలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్ణయించారు. రూ. 1.25 కోట్లతో అంచనాలు తయారుచేశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కొంతవరకూ నిధులు సమకూర్చుకుంటామని, మిగిలిన నిధులను దేవాదాయ శాఖ నుంచి కానీ తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కానీ మంజూరు చేయించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే రాజును కలిసి ఆలయ పునర్నిర్మాణం గురించి వివరించారు. స్పందించిన ఎంఎస్.రాజు ఈ అంశంపై చర్చించి నిధులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## శుద్ధ జల ప్లాంట్ పరిశీలన


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**చిలమత్తూరు :** మండలంలోని తమ్మలకుంట గ్రామంలో ఉన్న మెగా వాటర్ ప్లాంట్ (మిత్ర)ను గురువారం సిపిఎం నాయకులు పరిశీలించారు. వారు ప్లాంట్‌లో నీటిని నిల్వ చేసే ట్యాంకును పరిశీలించగా పాచి పట్టి ఉండటం గమనించారు. నిబంధనల మేరకు వాటర్ ప్లాంట్‌ను నిర్వహించని, పాచి పట్టిన నీటిని సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు శుద్ధి చేసిన నీటినే పంపిణీ చేయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రామచంద్ర, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగుపై రైతులకు సూచనలు

**లేపాక్షి :** మండలంలోని గొంగటిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, రాగి పంట పొలాలను గురువారం డిఆర్‌సి ఎడిఎ సనావుల్లా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో కలుపు నివారణ చర్యలను చేపట్టాలని రైతులకు సూచించారు. అలాగే ఎరువుల వాడకం, తెగుళ్ళ, నివారణ మందుల గురించి వివరించారు. రాగి పంటను పరిశీలించి మేలైన రాగి రకాలైన వకుల, తిరుమల వంటి రకాలను వాడి అధిక దిగుబడి సాధించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏవో శ్రీలత, ఎఇఒ పుష్పలత, ఆర్‌ఎస్‌కె సిబ్బంది తిరుమలేష్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, కళావతమ్మ, చౌడిరెడ్డి ఉన్నారు.

## రహస్య తనిఖీ వెనుక ఆంతర్యమేంటి?

**చిలమత్తూరు :** పట్టణంలో ఓ రియల్టర్ భూ ఆక్రమణల పర్వం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గురువారం ఆర్డీవో ఆనంద్‌బాబు, తహశీల్దార్ వెంకటేష్, ఇరిగేషన్ డీఈ యోగానంద్ ఆక్రమణలో ఉన్న భూమిని రహస్యంగా తనిఖీ చేశారు. అయితే వీరి పర్యటన మీడియాకు వెల్లడించకుండా రహస్యంగా నిర్వహించడం పట్ల అనుమానాలు వ్యక్తవుతున్నాయి. ఇప్పటికే అధికారులు సదరు రియల్టర్‌కు అండగా ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఇలా రహస్య పరిశీలనతో దానికి మరింత బలం చేకూరుతుంది. ఇకనైనా చిత్రావతిపై అక్రమంగా నిర్మించిన బ్రిడ్జి, ప్రభుత్వ భూములను ఆక్రమించి వేసిన కంచెను తొలిగిస్తారా లేదా అని వేచి చూడాలి.

## ప్రభుత్వ భూమిలో కంచె తొలగింపు

**ప్రజాశక్తి-రొద్దం**

స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా సచివాలయం-1 వద్ద ఉన్న భూమిని ఎవరూ ఆక్రమించకూ డదని డిప్యూటీ తహశీల్దార్ హెచ్చరించారు. రొద్దం గ్రామంలో ఉప్పుగడ్డలు (మాడుగడ్డలు) పేరుతో పిలిచే ప్రభుత్వ భూమి చుట్టూ ఓ వర్గం ప్రజలు కంచె వేయడానికి ప్రయత్నించగా గురువారం బిజెపి, టిడిపి నాయకులతో పాటు గ్రామస్తులు డిప్యూటీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ వారికి కేటాయించిన స్థలానికి మాత్రమే వారు కంచె వేసుకోవాలని మిగిలిన భూమిని ప్రజావసరాల కోసం ఉపయోగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే ఆ స్థలంలో ఎలాంటి కంచె, నిర్మాణాలు చేపట్టకూడదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన రెవెన్యూ అధికారులు వెంటనే ఆ స్థలం వద్దకు వెళ్లి ఈ స్థలం పూర్తిగా ప్రభుత్వానికి చెందినదని నిర్ధారించారు. ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాత ఈ భూమిని ప్రజావసరాల కోసం కేటాయిస్తామని తెలిపారు.


ప్రభుత్వ భూమిలో కంచెను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

## శ్రీసత్యసాయి యూనివర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**పుట్టపర్తి అర్బన్ :** శ్రీసత్యసాయి యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని యూనివర్సిటీ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్యతో పాటు అన్ని సదుపాయాలు, బోధన సిబ్బంది కలిగిన శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయర్ లర్నింగ్ యూనివర్సిటీలో చేరేందుకు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## బిసి గురుకులంలో..

**చిలమత్తూరు :** మండలంలోని టేకులోడు ఎంజెపి, కళాశాలలో 5వ తరగతి, బ్యాక్‌లాగ్ 6 నుంచి 9వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శోభారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. 5వ తరగతి 80 సీట్లు, ఇంటర్‌లో ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసి 40, సీఈసీ 40 సీట్లు ఉన్నాయని తెలిపారు.

## కెజిబివిలో..

**ధర్మవరం రూరల్ :** పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ ఎ.చంద్రకళ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, తల్లి లేక తండ్రి లేని వారు, బడి బయటి పిల్లలు, బడి వదిలేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పిల్లలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల న్నారు. మరిన్ని వివరాలకు కెజిబివిలో సంప్రదించాలన్నారు.

## హాల్ టికెట్, ఆధార్ తప్పనిసరి

**కొత్తచెరువు :** సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని డిఇఒ జి.క్రిష్ణప్ప, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఆధార్, హాల్‌టికెట్ తప్పన తీసుకురావాలని, లేనిచో పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు.

## కర్నాటకలో నేటి నుంచి 'పది' పరీక్షలు

**పావగడ :** కర్నాటక రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు నిర్భయంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని క్షేత్ర విద్యాశాఖ అధికారి ఇంద్రానమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాలూకాలో మొత్తం 2,850 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో పట్టణంలో 3, గ్రామీణ ప్రాంతాల్లో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు.

## 26న పంచాయతీ మార్కెట్ వేలం

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

మేజర్ గ్రామపంచాయతీకి సంబంధించి వివిధ మార్కెట్‌లు, షాపింగ్ గదుల వేలం పాటలను ఈ నెల 26, 27 తేదీల్లో పంచాయతీ కార్యాలయంలో సర్పంచి రాధా అధ్యక్షతన నిర్వహిస్తామని పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామగోపాల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ వారపుసంత, దినసరి సంత, బస్టాండ్, సులభ్ కాంప్లెక్స్‌కు, 27వ తేదీ 40 షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. పంచాయతీకి బకాయి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనేం దుకు అనర్హులు అన్నారు. వేలం పాటలు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి, ముదిగుబ్బను ప్లాస్టిక్ రహిత పంచాయతీగా తీర్చిదిద్దడానికి సహకరించాలని పంచాయతీ సెక్రటరీ మంజుల కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం స్థానిక వ్యాపారులతో ప్లాస్టిక్ నిరోధం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మనోహర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ క్రయవిక్రయాలు, వినియోగాన్ని నిరోధించడానికి సహకరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ తర్వాత దుకాణాలు, హోటళ్లు, ఎక్కడైనా ప్లాస్టిక్‌ను వినియోగిస్తే అపరాధ రుసుము విధిస్తారన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ దివాకర్, సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, వ్యాపారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలకు అవగాహన

**కొత్తచెరువు రూరల్ :** మండలంలోని యర్రపల్లి గ్రామంలో గురువారం మహాశక్తి సమాఖ్య, ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలో టింబక్ట్ కలెక్టివ్ ఆర్థిక సహకారంతో మహిళలకు గృహహింస చట్టం, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహ న కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చారు. ఆదిశక్తి సొసైటీ సిబ్బంది మహిళలపై జరుగుతున్న అఘాత్యాలు, చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదిశక్తి సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, మండల సిఇఒ జ్ఞానేశ్వరి, మహాశక్తి సిఇఒ రమీజాబి, మహాశక్తి అసోసియేట్ రవళి, ఆదిశక్తి సొసైటీ కవిత, పాలకవర్గం కమిటీ సభ్యులు, సొసైటీ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై సమావేశం

**ధర్మవరం రూరల్ :** నియోజకవర్గ ఓటరు జాబితాపై గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయాల పార్టీల ప్రజాప్రతినిధులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో చర్చించామని తెలిపారు. సమావేశంలో అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## జాబితాలో ఉన్న కార్డుదారులకే ఈకేవైసీ

**గాండ్లపెంట :** మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు జాబితాలో ఉన్న వారికి మాత్రమే ఈకేవైసీ చేయాలని గురువారం సిఎస్‌డిటి వాణిబాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 24 రేషన్ షాపులకు సంబంధించి జాబితాలో ఉన్న పేర్లను పరిశీలించి ఈ నెలాఖరులోపు ఈకేవైసి చేయించాలని డీలర్లకు తెలిపారు. ఈ అవకాశాన్ని రేషన్‌కార్డు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

## మసీదు రస్తా కబ్జాపై ఫిర్యాదు

**ముదిగుబ్బ :** స్థానిక అక్సా మసీదు రస్తా సమస్యపై గురువారం ముతవల్లి ఫకృద్దీన్ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ 80 ఏళ్ల చరిత్ర కలిగిన మసీదు రస్తాను కబ్జా చేశారని, ముఖ ద్వారం వద్ద కనీసం ఒక మనిషి కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామ పంచాయతీ సెక్రటరీ మంజుల దేవికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం అధ్యక్షుడు పోతులయ్య, మునాఫ్, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్, అల్లాబకష్, టైలర్ ముత్తు, నౌషాద్, చికెన్ రఫీ, తదితరులు ఉన్నారు.

## పావగడ తాలూకాకు త్వరలో తాగునీరు

**ప్రజాశక్తి-పావగడ**

తాలూకాలోని కోటగుడ్డ, శైలాపుర గ్రామంలోని తుంగభద్ర తాగునీటి పథకాలను గురువారం అధికారులు పరిశీలించి, ఈ నీరు తాగడానికి యోగ్యమైందని తెలిపారు. పావగడ తాలూకాలోని అన్ని గ్రామాలకు త్వరలో తుంగభద్ర నుంచి తాగునీరు అందుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈ కావ్య, జేఈ బసలింగపాటిల్, తుంగభద్ర ప్రాజెక్టు మెగా కంపెనీ అధికారి అశోక్, నవీన్, వాటర్ మెన్ పాల్గొన్నారు.

## ఎపి ఎన్‌జిఒ మహిళా ఉద్యోగుల సంఘం కమిటీ ఏర్పాటు

**ప్రజాశక్తి-మడకశిర**

ఎపి ఎన్‌జిఒ మహిళా వింగ్ ఉద్యోగుల సంఘం తాలూకా నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజే శ్వరి, తాలూకా అధ్యక్షులు ఎల్.రాము ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా ఎం.శ్రీదేవి, కో ఛైర్ పర్సన్‌గా బి. షిఫాకౌసర్, కన్వీనర్‌గా ఎం.కౌసర్ బేగం, ట్రెజరర్‌గా బి.లలితమ్మ, వైస్ ఛైర్‌పర్సన్లుగా కె.మేఘన, జిహెచ్.హారతి, ఎ.సునీత, కెటి.మేరీసుందరమ్మ, కో-కన్వీనర్‌గా కె.లీలావతి, సంయుక్త కన్వీనర్లుగా కె.నాగమణి, కె.కావ్య, ఎస్‌ఎం. రాధలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర ఉపాధ్య క్షురాలు రాజేశ్వరి, ఎంపిడిఒ సిఎల్.సోనిబాయి శాలువాలతో సన్మానించారు. మహిళా ఉద్యోగుల సమస్యలపై సంఘంలో చర్చించి వాటి పరిష్కారానికి పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌నాయక్, హరినాథ్, షమీఉల్లా, శాంతి సమరం, సుందరయ్య, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన ఎపి ఎన్‌జిఒ మహిళా ఉద్యోగుల సంఘం కార్యవర్గం

## పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

2003లో నోటిఫికేషన్ ద్వారా 2004లో ఉద్యోగాలు పొందిన ఉద్యోగులందరికీ పాత పెన్సన్ విధానాన్ని వర్తింపుచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గురువారం శాసనసభ సమావేశాల్లో కోరారు. 2003 నోటిఫికేషన్ ద్వారా అర్హత పొంది 2004లో ఉద్యోగాలు పొందిన డీఎస్సీ ఉపాధ్యాయులతో పాటు పోలీస్ కానిస్టేబుల్స్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, గ్రూప్-2 ద్వారా ఉద్యోగాలు పొందిన మొత్తం 11వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపుచేయాలని కోరారు.

## బంగారు క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో అన్నదానం

**కదిరి టౌన్ :** కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా గురువారం వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, విజయలక్ష్మి ఫౌండేషన్ వ్యవస్థాపకులు బంగారు క్రిష్ణమూర్తి వాల్మీకి ఆధ్వర్యంలో పట్టణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం నాయకులు ఆనంద్, నరసింహులు, అంజనా దేవి, ప్రమీల, జయశంకర్, అశోక్, నాగవేణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న బంగారు క్రిష్ణమూర్తి

# నేరాలు ఘోరాలు

## వ్యక్తి ఆత్మహత్య

**ధర్మవరం రూరల్ :** పట్టణంలోని గిర్రాజు కాలనీకి చెందిన బద్దెల ఓబునాథ్(35) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఓబునాథ్ టైల్స్ పని చేసేవాడని, ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించిందని మనస్థాపం చెంది కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో తన ఇంట్లోనే చీరతో ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉరేసుకొని యువతి..

**గోరంట్ల :** మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన విమల(20) గురువారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. విమల కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడు తుండేది. సమస్య తీవ్రం కావడంతో ఆ బాధ భరించలేక ఉరి వేసుకొంది. ఆమె తల్లి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదుగురిపై పోక్సో కేసు

**బత్తలపల్లి :** మాయమాటలు చెప్పి ఓ బాలికను పెళ్లి చేసుకుని మోసగించిన ఘటనలో ఐదుగురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఎస్ఐ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోట్లమర్రి ఎస్సీ కాలనీకి చెందిన బత్తల మారుతిప్రసాద్ 8వ తరగతి చదువుతున్న బాలికకు మాయ మాటలు చెప్పి స్నేహితుల సహకారంతో బెంగళూరుకు తీసుకెళ్లి పెళ్లి చేసుకుని అక్కడే తెలిసిన వారి ఇంట్లో రెండు రోజులు ఉన్నారు. ఆ తర్వాత వారు బాలిక ను మోసం చేశారు. దీంతో బాలిక ఫిర్యాదు మేరకు మారుతిప్రసాద్, అతడికి సహకరించిన అదే కాల నీకి చెందిన సాకే జనార్దన్, కారులో బెంగళూరు తీసుకెళ్లిన రేగాటిపల్లి గ్రామానికి చెందిన మల్లగుండ్ల రవితేజ, గోరంట్ల గ్రామానికి చెందిన నరేంద్ర, బెంగళూరులో వీరికి ఆశ్రయం కల్పించిన బాబులపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసును తీవ్రంగా పరిగణలోకి తీసుకొన్న ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ పర్యవేక్షణలో సిబ్బంది నిందితుల ఆచూకీ కనిపెట్టి అరెస్టు చేశారు. మారుతి ప్రసాద్, మల్లగుండ్ల రవితేజ, సాకే జనార్ధన్‌లను ధర్మవరం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ సోమశేఖర్, కానిస్టేబుల్ సుదర్శన్‌నాయుడు, అనిల్‌కుమార్‌ను సిఐ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వైసిపి నేతకు గాయాలు

**తాడిమర్రి :** మండలంలోని దాడి తోట గ్రామ సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తురకవారిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆర్వేటి పెద్దిరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ఉదయం తురకవారిపల్లి నుంచి వాహనంలో అనంతపురం వైపు వెళ్తుండగా దాడితోట గ్రామ సమీపంలో అదానీ కంపెనీకి చెందిన వాహనం ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో పెద్దిరాజుకు ఓ కాలు, ఓ చేయి విరిగాయి. వెంటనే ఆదానా కంపెనీ సిబ్బంది పెద్దిరాజును అనంతపురంలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు.

## గొర్రెలు, మేకలపై చిరుతల దాడి

**పావగడ :** తాలూకాలోని కన్నమేడి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి హనుమంతరాజుకు చెందిన గొర్రెలు, మేకలపై చిరుత పులులు దాడి చేసి చంపాయి. హనుమంతరాజు బుధవారం సాయంత్రం గొర్రెలను మేపేందుకు గ్రామ శివారులోని చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ పొదల్లో దాక్కున్న రెండు చిరుతలు గొర్రెలు, మేకలపై దాడి చేసి 2 గొర్రెలు, ఓ మేకను చంపాయి. దీంతో తాను నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని హనుమంతరాజు కోరాడు. విషయం తెలుసుకున్న పశు వైద్యురాలు డా. మేఘన సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

# అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ



బత్తలపల్లిలో శిక్షణలోపాల్గొన్న అంగన్వాడీలు



మడకశిరలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువా రం సిడిపిఒ సరస్వతి అధ్యక్షతన అంగన్వాడీ వర్కర్లకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా ఎంఇఒలు సుధాకర్ నాయక్, చాముండేశ్వరీ హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో భాగంగా చిన్నా రుల్లో అంగన్వాడీ స్థాయి నుంచే విద్యాబుద్ధులు నేర్పడం, మేధోశక్తిని పెంచడంపై సిఆర్పిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు దేవమణి, లలితమ్మ, మండలంలోని అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అంగన్వాడీ వర్కర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సిడిపిఒ సునంద ప్రారంభించారు. మండలంలోని ముదిగుబ్బ, ఎనుములవారిపల్లి క్లస్టర్లకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ప్రీ స్కూల్‌కు సంబంధించి మెలకువలను చలనచిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఒ హేమలత, సూపర్వైజర్ చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర :** స్థానిక ఉపాధ్యాయభవన్‌లో 45మందికి, ఎంపిడిఒ కార్యాలయంలో 45 మంది అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ బి పడాయి బి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి హాజరయ్యారు. సిడిపిఒ నాగమల్లేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న విద్యుత్‌మీటర్ రీడర్లు

## విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ మీటర్ రీడర్స్ 15 ఏళ్లుగా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రోడ్డున పడతారన్నారు. కావున రీడర్స్ అందరికీ ఉద్యోగ భద్రత కల్పించి, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రీడర్స్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, కోశాధికారి దస్తగిరి, జిల్లా అధ్యక్షుడు షానవాజ్, నాయకులు రాఘవరెడ్డి, బాబా, నరేష్, రవి, గణేష్, వేణుగోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం

**ప్రజాశక్తి-హిందూపురం**

ఆరోగ్యకరమైన నోటి ద్వారా ఆత్మగౌరవం పెంపొందుతుందని శ్రీ సత్యసాయి జిల్లా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ భూపాళం విజయబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి దంత విభాగంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి 20వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ నోటి దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఎ దంత సంరక్షణ పొందడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని, జీవన నాణ్యతను మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం చికిత్స నిమిత్తం వచ్చిన దంతలో బాధితులకు పేస్టు, బ్రష్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ప్రేమ్ కుమార్, సాంకేతిక సహాయకులు లోకేష్, చైతన్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు పేస్టు అందిస్తున్న వైద్యులు

## సొసైటీ బ్యాంక్ స్థలాన్ని పరిరక్షించాలి

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి పక్కన కోట్ల రూపాయల విలువచేసే సొసైటీ బ్యాంక్ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో సొసైటీ బ్యాంకు సీఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ 2.5 ఎకరాల సొసైటీ బ్యాంక్ స్థలాన్ని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. బ్యాంకు స్థలంలో అక్రమ కట్టడాలను కూల్చడంతో పాటు ఆక్రమణకు గురి కాకుండా కంచె ఏర్పాటు చేయాలని, లేనిచో సిపిఐ ఆధ్వర్యంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి అక్రమ కట్టడాలను కూల్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. వారికి జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సౌత్ స్టేట్స్ గౌరవాధ్యక్షులు బి.వెంగమేష్‌చౌదరి మద్దతు పలికారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, తుమ్మల చిన్నప్ప, ఈశ్వర్‌నాయక్, మల్లాది లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్లంబర్లకు పట్టాలివ్వకపోతే 24న ధర్నా

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 650-2లో అర్హులైన ప్లంబర్స్‌కు పట్టాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి తహశీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 650-2లో అనర్హులు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, వారి పట్టాలు తొలగించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. లేనిచో ఈ నెల 24వ తేదీ భూఆక్రమణ జరిగిన స్థలంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలా లక్ష్మీనారాయణ, ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు తాజ్, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## పేరు తొలగింపు దుర్మార్గం : వైసిపి

**ప్రజాశక్తి-హిందూపురం**

విశాఖపట్నం క్రికెట్ స్టేడియానికి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరును కూటమి ప్రభుత్వం తొలగించడం దుర్మార్గమైన చర్య అని వైసిపి హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణు రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం స్థానిక వైసిపికార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి వైసిపి నాయకులను వేధించడమే కాకుండా, చివరకు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత పేరును కూడా మరిపించాలని చూస్తోందని అన్నారు. వైయస్సార్ జిల్లాగా ఉన్న పేరును కూడా తొలగించారని, తొలగించిన పేరును వెంటనే యాథావిధిగా పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక చోట్ల వైఎస్ఆర్ విగ్రహాలు ధ్వంసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## ఆక్రమణలు తొలగించుకోండి

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ప్రజలు మురుగు కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలను చేపట్టారని వాటిని స్వచ్చందంగా తొలగించుకుంటే మురుగు కాలువల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ముక్కడి పేట ప్రాంతంలో పర్యటించారు. ప్రజలందరు పురపాలక సంఘానికి సహకరిస్తే పట్టణాన్ని సర్వసుందరంగా తీర్చిదిద్దాడానికి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తో పాటు మున్సిపల్ హెల్త్ అధికారి శోభన్ రెడ్డి, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డు ప్రజలతో మాట్లాడుతున్న ఛైర్మన్

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-హిందూపురం**

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం పక్షోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలోని మోడల్ కాలనీ నందు ఓంకార సమైక్య గ్రూప్, మదర్ థెరిసా మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్, గౌరవ అతిథిగా సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, బీసీ సెల్ కన్వీనర్ దుర్గా నవీన్, వార్డ్ కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి, దుర్గా మంజుళ, రహమత్ బి, రాధమ్మ గారు, జిల్లా మహిళా సంఘాల అధ్యక్షులు విజయలక్ష్మి, డీఎంసీ గంగులయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మహిళలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మహిళా పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒలు వరలక్ష్మి, తౌసీఫ్, పరంజ్యోతి, గంగరత్నమ్మ, పట్టణ సమైక్య ఓబి విజయలక్ష్మి, సరస్వతమ్మ, ఆర్ పి నాగలక్ష్మి, స్వప్న, సుమతి, సుజాత, లక్ష్మి, రాధా, వేణి, బంతి లత, నర్మద, నాయకులు రవి, చంద్రాయుడు, దస్తగిరి, అరుణమ్మ,సెక్రటరీలు శిల్ప, వరలక్ష్మి, అంబిక, మంజు, వినయ్‌తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.